# ప్రేమకు మెట్లు ఎన్ని?

[ఒక గొప్ప కవి దగ్గరకు వెళ్ళేముందు బాగా ఆలోచించి అడుగు ముందుకు వెయ్యాలి— ఈ మధ్య శరత్ బాబు "దేవదాసు" మీద ఒక కెరటం విరుచుకుపడింది—అందులో రచన వుందీ; సినిమా వుందీ—దానిమీద అనేక చర్చలూ, విమర్శలూ! "తంబు" గారి ఆవేదనా — అన్నీను — అన్నీ జరిగాక, మళ్ళీ — మనిషి మేధస్సు మథన పడుతూనే వుంటుంది. అది చైతన్యానికి ప్రతీక. అందుకే ఆ "దేవదాసు" మీద మళ్ళీ ఈ రచన అయితే—శరత్ బాబు రాసిన దేవదాసు నవల ప్రింటుకుముందు విశ్వకవి టాగూర్‌కు రీడింగ్‌కుగాను యిచ్చివుంటే — ముగింపుపై గురుదేవ్ భావాలు ఎలా వుండేవి — అన్న వారిద్దరి సన్నిహితత్వంలో నలిగిన ఆలోచనే ఈ రచనకు ఇన్‌స్పిరేషన్.]

❋ వర్షం కురిసిన రాత్రి ❋

పార్వతికి నిద్రపట్టలేదు. నిద్రపోయిన కాస్సేపు పీడకలలు—

అదే పనిగ ఎవరో ఏడుస్తున్నట్టు........

సముద్రం పొంగి లోకాన్ని ముంచేసినట్టు—

పార్వతి గుండె బరువు ఎక్కువయింది!

సరిగా ఊపిరి ఆడటం లేదు. కళ్ళు తెరిచింది.

వర్షం తగ్గుముఖం పట్టినట్లుంది. తొలి వెలుగు రేఖలు వర్షంలో! తడిసి, లోకంలోకి చొచ్చుకు వచ్చేందుకు ప్రసవ వేదన పడుతున్నాయ్ ఇక పక్కమీద పడుకోలేక పోయింది పార్వతి. లేచి; కళ్ళు నులుముకుని, మాంగల్యం కళ్ళకద్దుకుని, వంట గదిలో కెళ్ళింది

ఇంకా చీకట్లో వచ్చే పనిమనిషి, ఆవాళ రాలేదు—

'ఏమయిందీ' అనుకుంటూ వుండగానే పనిమనిషి వచ్చింది

—సత్రం దగ్గర చెట్టుకింద ఎవడో తాగుబోతు చావుబతుకులలో వున్నాడనీ అందరూ గుమికూడి చూస్తున్నారే కానీ, ఎవరూ ఏ సాయం చేయడం లేదనీ.... చూస్తుంటే చాలా మంచి బాబులా కనిపిస్తున్నాడనీ.... పగవాడికి కూడా అలాంటి దిక్కులేని చావు వద్దనీ— చెప్పింది.

'పాపం' అనుకుంది పార్వతి.

ఇంతలో పెద్దబ్బాయ్ మహేంద్ర వచ్చి, పార్వతికి ఒక ఉత్తరం అందించారు.

"మీ నాన్నగారు ఎక్కడికెళ్ళారు?" అడిగింది పార్వతి, ఆ ఉత్తరం వారి దగ్గర ఇవ్వలేక పోయావా?— అన్నట్టు.

"వాహ్యాళి కెళ్ళారు" అని చెప్పి, వెళ్ళిపోయాడు మహేంద్ర.

ఉత్తరం విప్పింది పార్వతి.

అందులో యిలా వుంది—

పారూ!

చనిపోయే లోపల మీ వూరు వస్తానన్నాను. వచ్చాను. ఇక్కడ సత్రం దగ్గర పడివున్నాను. నిన్ను చివరి చూపు చూడాలని వుంది. కానీ, రాలేనేమో?

గుండెల్లో ఊపిరి బిగబట్టి ఈ వుత్తరం రాస్తున్నాను. ఇది నీకు అందుతుందో లేదో? నీకు అందే లోపల నేను బ్రతికివుంటానో లేదో??

నిన్ను చూడాలని వుంది.

మీ
దేవదా

పార్వతిలోని చైతన్యం గట్టిగా కేక వేసింది కానీ, అది చాలా అస్పష్టంగా పెదవులగుండా బహిర్గతం అయింది, "దే....వ....దా" అంతే.

ఆ తర్వాత ఒక్క క్షణం అక్కడ నిలువలేక పోయింది.

పాపం — పుణ్యం, నీతి — అవినీతి, న్యాయం - ధర్మం ఆలోచించే స్థితి దాటిపోయింది.

ఆమెకు యిప్పుడు కనిపిస్తున్నది ఒకే వ్యక్తి — వచ్చే ప్రాణం, పోయే ప్రాణం, స్థితిలో .... తనకోసం ఎదురు చూస్తున్న దేవదాసు!!!

## ప్రేమ ప్రసవించిన వెలుగు

తనను ప్రాణం కన్నా మిన్నగా ప్రేమించిన దేవదాసు— అలా అక్కడ అనామకంగా పడివున్న దృశ్యం ... పార్వతి మనసును ముక్కలు చేసింది.

'తనింకా జీవించివుంది, తన దేవదాసును యిలా చూసేందుకేనా?'-

బాధతో మెలికలు తిరిగిన హృదయాన్ని దోసిట్లోకి తీసుకుని, అది దేవదాసును బ్రతికించగలిగితే!—అన్నట్లు, "దేవదా!" అంటూ దగ్గరి కెళ్ళింది.

దేవదాసు అప్పటికే స్పృహ కోల్పోయాడు. కళ్ళు మూతలు పడిపోయ్యాయి.

ఎక్కడో ఒక జీవుడు కొటుకొడుకుతున్నాడు. దేవదాసు చెవి దగ్గరకు వెళ్ళి, "దేవదా! నే వచ్చేశాను. నేను....వచ్చాను. ఒక్కసారి....ఒక్కసారి కళ్ళు తెరిచి చూడవూ?" అన్నది పార్వతికాదు: ఆమె హృదయం. ఆమె వెచ్చని కన్నీళ్ళు దేవదాసు ముఖాన్ని తడిపాయి.

ఆ కన్నీటి స్పర్శకు, "ఊ(.... ఊ(...." అని మూల్గుతున్నాడు. "పారూ!.... పారూ.... కలవరించినట్లు అనగలిగాడు, ఆమె రాక పసిగట్టి నట్టు. కానీ కళ్ళు తెరవలేక పోయాడు. మళ్ళీ మామూలుస్థితి లోకి వెళ్ళిపోయాడు ఆరిపోతున్న దీపంలా.

అప్పుడే దేవదాసును పరీక్షించిన ఓ మామూలు వైద్యుడు పెదవి విరిచాడు.

"అమ్మా! అతను యిక బ్రతకడు."

"వీల్లేదు; దేవదాసు చనిపోకూడదు. దేవదాసు జీవించాలి ... దేవదాసు జీవించాలి" ఆ మాటలు ఆమె మదిలోనే మోగాయి. అక్కడే ఆగాయి.

నిరాశగా పైకి లేచింది.

జమీందారు భువనమోహన చౌదరీగారి ఇల్లాలు పార్వతి— అన్ని అంతస్థుల మెట్లు దిగి, అలా అక్కడికొచ్చి: వీధిలో మట్టిమీద పడివున్న ఒక అనాధుడికోసం కన్నీరు పెట్టుకుంటూ వున్నదన్న సంగతి విన్న వూరంతా అప్పటికే గుమికూడారు. హడావుడిగా మహేంద్ర కూడా వచ్చేశాడు కారులో.

"అమ్మా! మీరు.... ఇక్కడ??...."

పార్వతి ఒక నిర్ణయానికి వచ్చేసింది అప్పటికే "మహేంద్రా! దేవదాసును కారులో పడుకోబెట్టు. నేను అతనితో కలకత్తా వెళుతున్నాను" అన్నది దృఢంగా.

"అమ్మా?...."

"ఇది నా నిర్ణయం" మరో మాటకు ఆస్కారం ఇవ్వకుండా వెళ్ళి కారెక్కి కూర్చుంది పార్వతి.

మహేంద్ర దేవదాసును కారు వెనుక సీటులో పడుకోబెట్టాడు.

"డ్రైవర్! కలకత్తా పోనీయ్!" అన్నది పార్వతి.

అలాగే జరిగింది.

## * రక్తానికి ప్రాణం వుంది *

డాక్టర్ శరత్ పెదవులు నిరాశను చప్పరింపాయ్!

"దేవదాసు జీవించడం కష్టం, లంగ్స్ బాగా దెబ్బతిని వున్నాయ్. చాలా రక్తహీనంగా వున్నాడు. రక్తం ఎక్కిస్తూ ఆపరేషన్ చేయవలసి వుంటుంది సక్సెస్ కావడం చాల కష్టం. అదీ హార్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ టాగోర్ తప్ప ఈ ఆపరేషన్ మరెవ్వరూ చేయలేరు. చాలా ఖర్చవుతుంది. అప్పటికీ నమ్మకంలేదు, చివరి ఆశ మాత్రమే!"

పార్వతి ప్రాథేయపడింది. "డాక్టర్‌గారూ! ఎంత ఖర్చయినా సరే! దేవదాసును బ్రతికించండి. అతను ఈ స్థితికి రావడానికి కారణం నేను. అతను చనిపోతే.... నేను తిరిగి వెళ్ళను దయవుంచి నా ఆవేదన అర్థం చేసుకోండి."

"ఐ కెన్ అండర్ స్టాండ్ .. ఐకెన్!.... ముందు డాక్టర్ టాగోర్‌ను పిలిపించే ఏర్పాట్లు చేయాలి ఆపరేషన్ వెంటనే జరగాలి" అంటూ లోపలి కెళ్ళిపోయాడు డాక్టర్ శరత్. చివరి నాడి కొట్టుకుంటూ ఎగ్జామినేషన్ టేబిల్‌మీద దేవదాసు....

ఇప్పుడెలా?

తన దగ్గర డబ్బు లేదు. ఆందోళనలో. ఆవేదనలో కలకత్తా వచ్చేసింది. కారును వూరు పంపించే వ్యవధి కూడా లేదు — ఇప్పుడేం చెయ్యడం??

డాక్టర్ టాగోర్ డబ్బు యివ్వకుండా వస్తారా??.... వారు రాకపోతే??.... ఓహ్.... అసలు ఎక్కడున్నారో??.... ఈ కలకత్తా నగరమే తనకు కొత్త....?? చివరి ప్రయత్నమైనా వెంటనే ఆపరేషన్ జరగాలంటున్నారు డాక్టర్‌గారు.... ఇప్పుడెలా??3"—

—పార్వతి కళ్ళనిండా నీళ్ళు....

....గుండెనిండా దేవదాసును బ్రతికించుకోవాలన్న తపన....

అలజడిగా ఇటు తిరిగింది!

తల తిరిగి పోయింది!!

ఎదురుగా భర్త—భువనమోహన్ చౌదరి!!!

పార్వతి కంపించి పోయింది.

తలమీదికి ముసుగు తీసుకోవడం కూడా మర్చిపోయింది.

జమీందారుగారు....?? ఇక్కడ....?? "మీరు....?!"

అంతకంటే పార్వతిని ఎక్కువ మాట్లాడనివ్వలేదు, భువనబాబు, "నే వెళ్ళి డాక్టర్ టాగోర్‌ను పిలుచుకుని వస్తాను" అంటూ వెళ్ళిపోయాడు, చేతిలోని కర్ర హుందాగా వూపుకుంటూ.

పార్వతి వూపిరి పీల్చుకునే లోపల కారు స్టార్ట్ అయింది.

'అయితే—' మరో పదం పార్వతిని ఆలోచింప నివ్వలేదు. డాక్టర్ శరత్ "ఐయామ్ సారీ, పార్వతీగారూ! దేవదాస్ గ్రూప్ రక్తం మన హాస్పిటల్‌లో లేదు బయటనుండి తెచ్చేటంత అవకాశమూ లేదు. ఎలా?" అన్నాడు

ఎలా?— ఎలా?— ఎలా?—

"డాక్టర్! నా రక్తం తప్పకుండా సరిపోతుంది. ప్రయత్నించండి" అన్నది పార్వతి ఆవేశంగా.

"మీరు చాలా ఆవేశపడుతున్నారు. ప్రాక్టికల్ డిఫికల్టీస్ ఆలోచించడం లేదు. నిజానికి బ్లెడ్‌ను రిజర్వులోనికి తీసుకునే వ్యవధి కూడా లేదు అప్పుడే ఆపరేషన్ థియేటర్ రెడీ అయిపోయింది. పేషంట్ టేబిల్ మీద వున్నాడు. టెస్ట్‌లో మీ రక్తం సరిపోయేలా తేలితే.... ఆపరేషన్ జరుగుతున్నప్పుడే మీ రక్తాన్ని, పేషంట్ ఒంట్లోకి పంపటం జరగాలి. చాలా జాగ్రత్తగా మెయిన్‌టెయిన్ చేయాలి మీ ప్రాణానికి కూడా ముప్పు ఏర్పడే అవకాశం వుంది. పేషంట్ కండిషన్ దేనికీ టైం యివ్వడం లేదు మరి....?"

"డాక్టర్! మీకు తెలియదు. నా ప్రాణం యిచ్చేందుకైనా నేనిప్పుడు సిద్ధంగా వున్నాను."

ఇంతలో అక్కడికొచ్చిన నర్స్, "ఎక్స్‌క్యూజ్మీ సార్! డాక్టర్ టాగోర్ బయలుదేరారని ఫోన్ వచ్చింది" అని చెప్పింది.

"దెన్ ఆల్‌రైట్! కమాన్.... క్విక్...." అంటూ లోనికి దారితీశాడు డాక్టర్ శరత్.

## * టాగోర్ చేసిన ఆపరేషన్ *

పార్వతి రక్తం దేవదాసు గ్రూప్‌కు సరిపోయింది.

డాక్టర్ టాగోర్ వచ్చారు.

పార్వతి ఒక బెడ్‌మీద, దేవదాస్ మరో బెడ్‌మీద—

పార్వతి రక్తం మోసుకెళుతోన్న ట్యూబ్స్ దేవదాసుకు అమర్చి వున్నయ్—

రెండు ప్రేమ హృదయాలు— ఒకదానికోసం ఒకటి—

ఆపరేషన్ మొదలయింది.

దేవదాసు ఊపిరి యంత్రాలలో పరీక్షలు జరుపుకుంటోంది.

హార్ట్ ఓపెన్ చేశారు డాక్టర్ టాగోర్ హార్టంతా ప్రేమమయం ఆ ప్రేమను త్రాగుడులోని విషం మింగేసింది. అంతేకాదు. అంతగా ప్రేమించే ఆ హృదయాన్ని కూడా మింగేస్తూ వుంది.

ఇప్పుడా విషాన్ని వేరుచేసి, ప్రేమను పునరుజ్జీవింప జేయాలి

అలా వేయగలిగితే 'ఆపరేషన్ సక్సెస్' ఫెయిల్ అయితే ఆ 'హార్ట్' ఆగిపోతుంది. ఆగిపోయిన ఆ హృదయం కోసం మరికొన్ని హృదయాల ఘోష?

ఈ జీవ చైతన్య చక్రమే ఈ జీవితం!

"వెరీ డిఫికల్ట్ జాబ్" అన్నట్లు కళ్ళద్దాలలోంచి డాక్టర్ శరత్ వంక చూశాడు డాక్టర్ టాగోర్

"నేను ముందే చెప్పానుగా? కొన్ని జీవితాలకు ముగింపు యింతే!! మించిపోయిన కేస్...." అన్నట్లు కళ్ళతోనే డాక్టర్ శరత్ సమాధానం! నవ్వారు డాక్టర్ టాగోర్, నిశ్శబ్దంగా.

"నవీన శాస్త్రంమీద, క్రొత్త పద్ధతుల మీద నాకు విశ్వాసం వుంది. మానవ ప్రయత్నం మనం చేద్దాం. ఒక హృదయం బిగిర్చాలని, మరో హృదయం చివికి పోతోంది. గాలికి ఆరిపోబోతున్న దీపానికి మన చేతులు అడ్డుపెట్టుదాం" అన్నటు తల వూపి, కొత్త సిజర్స్ అందుకున్నారు డాక్టర్ టాగోర్.

ఒక డాక్టర్‌లో అపనమ్మకం—

ఒక డాక్టర్‌లో నమ్మకం —

జైలీన్ ట్యూబ్ ఆరాటం—

అధునిక యంత్రాంగం,— అంతరంగాల ప్రేమబంధం — మధ్య దేవదాసు ప్రాణాల పోరాటం—

అపరేషన్ థియేటర్ వెలుపల భువనమోహన్ చౌదరి గంభీర మౌనం—

పార్వతి రక్తం దేవదాసు ఒంట్లోకి జొరబడి, ప్రాకుతోంది.

పార్వతి తను కరిగి, దేవదాసులో కలిసిపోతున్నట్లు అపూర్వ అనుభూతి పొందసాగింది.

తన ప్రాణం, తన ఆత్మ —రెండూ దేవదాసులోకి వెళ్ళిపోయినట్లు, ఆ అదృష్టం తనకు లభించినందుకు పార్వతి కళ్ళు సజలాలయ్యాయి

అన్నిటికీ సాక్షీభూతంగా వెలుగుతోంది, థియేటర్ బయట రెడ్ బల్బ్—

## * ప్రేమ కళ్ళు తెరిపించింది. *

ఆపరేషన్ సక్సెస్—

దేవదాసు జీవించాడు.

ఆ 'సక్సెస్' కు అయిన ఖర్చు మొత్తం చెల్లించేందుకు వెళ్ళాడు భువన చౌదరి

దేవదాసును చూసేందుకు అలసటను కూడా లెక్కచేయక వెళ్ళింది పార్వతి—

దేవదాసు మైకంగా కళ్ళు తెరిచాడు. ఎదురుగా పార్వతి నీరసంగా నవ్వుతోంది.

'ప్రేమ శిఖరం' చేరుకోవాలని యిద్దరూ చెరో వైపునుండి మెట్లెక్కుతున్నారు. శిఖరంమీద అడుగు పెట్టాలంటే యింకా ఎన్ని మెట్లు ఎక్కాలి??

మూగగా భాషించుకున్నాయి వారి భాష్ప నయనాలు.

## * మమతకు మహారాజు కూడా బానిసే! *

క్యాలెండర్‌లోని తేదీలు మారిపోయాయి.

అన్ని రోజులు పార్వతికి దేవదాసుతోనే లోకం!

ఏది ఎప్పుడు కావాలన్నా అందించేవాడు వారితో సహజీవనం సాగిస్తున్న భువనబాబు. ఆ వయసులోనూ అలసిపోకుండా రాత్రింబవళ్ళు హాస్పిటల్ వద్దే వుండిపోయాడు ఆ జమీందారు, ఎప్పుడు ఏ అవసరం వస్తుందోనని!!

పార్వతి వారించలేదు: అంతదూరం ఆలోచించనూ లేదు.

సాయం వచ్చిన మహేంద్రను కూడా పంపివేశాడు భువనబాబు!!

## * అమర ప్రేమకు ఆత్మ వుంది *

ఓనాడు ఉషోదయాన—

స్పెషల్ వార్డ్‌లో కోలుకొంటున్న దేవదాసు గదిలోకి వచ్చాడు డాక్టర్ శరత్.

పార్వతి మేలి ముసుగు మరింతగా తలమీదికి లాక్కొని, లేచి నిలబడింది మామూలుగా.

దేవదాసును పరీక్షించి, తృప్తిని ప్రకటించాడు డాక్టర్.

"యు ఆర్ నౌ ఆల్‌రైట్. ఇక మిమ్మల్ని నిర్భయంగా రేపే డిస్చార్జి చెయ్యొచ్చు"

"థ్యాంక్యూ డాక్టర్" అన్నాడు ఉత్సాహంగా దేవదాసు.

"మీ తపస్సు ఫలించింది." వెళ్ళేటప్పుడు పార్వతిని అభినందించి వెళ్ళాడు డాక్టర్ శరత్.

దేవదాసు పార్వతి దెస చూశాడు

పార్వతి తడి కళ్ళల్లో లాస్యం చోటు చేసుకుంది.

"పారూ!"

అతని పెదవుల కదలిక.

పార్వతి కళ్ళల్లో తడి తుడుచుకుని దేవదాసు చేతిని ఆప్యాయంగా తన చేతిలోకి తీసుకొని, మృధువుగా స్పర్శించింది.

"నాలోని నీరక్తం ఎంత సంబరపడి పోతుందో గమనిస్తున్నావా??"

"లేదు. నువ్వు సజీవంగా వున్నందుకు నాలో మిగిలిన రక్తం పరామర్శిస్తోంది."

"పారూ! నన్ను బ్రతికించుకున్నావా?."

"నువ్వు జీవించాలి. అది నాకోరిక. నువ్వులేని పార్వతి వుంటుందని ఎలా అనుకున్నావ్ దేవదా??"

"ఓహ్ ...! పారూ!! మరి, అంతపెద్ద బంగళాలోంచి, అన్ని కట్టు బాట్లలోంచి.... "నువ్వు.... నాకోసం ...."

"నాకోసం నువ్వు జీవితాన్నే బలి చేయ్యాలనుకున్నావ్....??"

"మరి, మీ వారు...."

"నీ పరిస్థితి చూచి. నేను చలించిపోయాను. నిన్ను బ్రతికించుకోవాలన్న ఆరాటంలో అన్ని విస్మరించి వచ్చేశాను. కానీ, దేవదా! నువ్వు జీవించేందుకు వారెంత శ్రమతీసుకున్నారో తెలుసా? డాక్టర్ టాగోర్‌ను వారే తీసుకొచ్చారు; ఈ ఖర్చంతా వారే భరించారు."

"అలాగా ?...."

"ఊఁ...."

"పారూ! భగవంతుడు నిజంగా వున్నాడనిపిస్తూ వుంది. చనిపోయే లోపల నిన్ను చూడాలని ఎంతగా కాంక్షించానో???"

"అలాగా ?" అంటూ నవ్వింది పార్వతి

"ఇక కలకాలం చూస్తూవుండొచ్చు" అంటూ ప్రవేశించాడు భువన చౌదరి.

పార్వతి తలమీది కొంగును మరింతగా లాక్కుంది.

దేవదాసు అతనికి కృతజ్ఞతగా నమస్కరించాడు. భువనచౌదరి పార్వతి కూర్చున్న చోట కూర్చొని. దేవదాసును పరామర్శించాడు.

"మీ మేలు ఈ జన్మకు మరచిపోలేను. మీ ఋణం ఎలా తీర్చుకోగలనో?" అన్నాడు దేవదాసు రుద్ధ కంఠంతో

"మీరు మరచిపోకూడనిది, ఋణం తీర్చ వలసిందీ పార్వతికి. పార్వతి అపాయం అని తెలిసికూడా తన రక్తాన్నిచ్చి, మిమ్మల్ని బ్రతికించుకుంది".

దేవదాసు మళ్ళీ పార్వతి దెసచూచాడు, కృతజ్ఞతా పూర్వకంగా,

తెల్లని, చల్లని సన్నని వలువ క్రింద పూజకు సిద్ధంగా వున్న గులాబి కన్యలా పార్వతి నేలను చూస్తూ వుంది.

మళ్ళీ భువన చౌదరే మాట్లాడసాగాడు.

"మా పార్వతిలో నవ్వును నేను ఎన్నాళ్ళకు చూడ గలిగానో! అదే నాకు ఆనందంగా వుంది పార్వతీ! ఇలారా??"

పార్వతి అలాగే దగ్గరికొచ్చి నిలుచుంది.

జమిందారు లేచి, "చూడు పార్వతీ! మీరిద్దరు ఒకరికొకరు ప్రాణం యిచ్చుకునేంత ప్రేమికులు. మీ గురించి విన్నానే కాని, ఇప్పుడు మీ ప్రేమను ప్రత్యక్షంగా చూసే అవకాశం లభించింది.

"అల్లకల్లోలంగా వున్న నా ఇంట అడుగుపెట్టి, ఒక దారికి తెచ్చావు. చీకటే మిగిలిందనుకున్న నా బంగళాలో వెలుగును నింపావు. మాకు కొత్త జీవితాన్ని చవిచూపావు అందుకు మేమంతా నీకు కృతజ్ఞులము.

"ఆనాళ జరిగింది మహేంద్ర చెప్పాడు. నీ మానసిక స్థితి అర్థం చేసుకోగలిగాను. ఈ 'ప్రేమ సేవ'లో భాగం పంచుకో గలిగాను, నేను చెయ్యగలిగింది చేశాను.

"దేవుని దయ వలన దేవదాసు జీవించాడు. అది నీకెంత ఆనందమో నా కంతకంటే వెయ్యిరెట్లు హర్షదాయకం.

''నిజానికి దేవదాసు నీవాడు. మానసికంగా మీరిద్దరు ఏనాడో భార్యా భర్తలు. మీ ఇద్దరు కలకాలం కలిసి వుండటమే నేను కోరు కుంటున్నాను.

"—ఇదంతా నేనేదో మనసులో పెట్టుకొని, మాట్లాడడం లేదు, మనస్ఫూర్తిగా మిమ్మల్ని ఆశీర్వదిస్తున్నాను. తనకోసం స్పందించగల ఒక్క హృదయం చాలు, మనిషి జీవితానికి—

"కారు ఇక్కడే వుంచుతున్నాను.

మీరెక్కడికయినా వెళ్ళొచ్చు.

మరో విషయం –

మీకోసం నా బంగళా తలుపులు ఎప్పుడూ తెరిచే వుంటాయ్. అందులో మీకు సర్వ హక్కులూ వుండేటట్లు ఏర్పాటు చేస్తాను" వాగ్ధారను ఒక్కక్షణం ఆపి, పార్వతికి దగ్గరగా వచ్చి, "కానీ, పార్వతీ! నన్నూ, పిల్లల్ని మరచిపోవద్దు—"

ఎంత అణుచుకోవాలని ప్రయత్నించాడో, అంత ఉధృతంగా కళ్ళ నుండి జాలువారిన అశ్రువులను ఉత్తరీయంతో అద్దుకుంటూ అక్కడ నుండి కర్ర వూపుకుంటూ, బయటకు వెళ్ళిపోయాడు భువనచౌదరి.

గదిలో మిగిలిన ఇద్దరూ ప్రతిమల్లా ఉండిపోయారు.

## * ప్రేమకు మెట్లు ఎన్ని? *

మరు రోజు ఉదయాన—

పెద్ద కారొచ్చి భువనమోహనచౌదరీ బంగళా ముందు ఆగింది.

మధ్య హాలులో కూర్చొనివున్న భువనబాబు చుట్టూ మహేంద్ర, యశోద, వినోదలాల్, జలదబాల—అందరూ చిన్న పిల్లల్లా దిగాలుపడి కూర్చొని వున్నారు.

కారు శబ్దం వినగానే అందరూ బిలబిలమని లేచారు; వాకిలివైపు రాబోయారు.

అంతలోనే భువనచౌదరి నిశ్శబ్దంగా వారించడంతో, అందరూ మరలా కూర్చుండిపోయారు పూర్తి ఆరోగ్యంతో దేవదాసు, పార్వతి వచ్చారు ఆ జంట చూడ ముచ్చటగా వుంది.

ఇద్దరినీ లోనికి ఆహ్వానించాడు జమీందారు. పార్వతి ఆనవాయితీ ప్రకారం భర్తకు పాదాభివందనం చేసి, తలమీద చీర కొంగును మరింత ముందుకు లాక్కొని, మెట్లెక్కి, పై అంతస్థులోని తన గదిలోకి వెళ్ళిపోయింది.

భువనమోహనచౌదరీకి ఎదురుగావున్న సోఫాలో ఆసీనుడయ్యాడు దేవదాసు మిగిలినవారు పార్వతి దగ్గరకు వెళ్ళిపోయారు, మహేంద్రతో సహా!

"మేము తిరిగి మాట్లాడే వ్యవధి యివ్వకుండా వచ్చేశారు మీరు. మీ ఔదార్యంతో, అనంతమైన మీ హృదయ సౌందర్యంతో పార్వతిని మీరే గెలుచుకున్నారు మీ అంతటి సంస్కారి భర్తగా లభించడం పార్వతి అదృష్టం. అది తెలియక, తెలుసుకోలేక నేను యిన్నాళ్ళూ నరకయాతన అనుభవించాను ఏ ప్రేమికుడైనా తన ప్రేమకు పాత్రమైన వ్యక్తి సతృప్తినీ, సంతోషాన్నీ కోరుకుంటాడు అది మీ దగ్గర పార్వతికి లభ్యమవుతుందని నేను ప్రత్యక్షంగా తెలుసుకోగలిగాను. అది చాలు నేనిప్పుడు నిజంగా జీవిస్తున్నట్లే? మీ ఋణం ఎప్పటికీ తీర్చుకోలేను. వస్తాను" అంటూ నమస్కరిస్తూ పైకి లేచాడు దేవదాసు.

"నూరేళ్ళు వర్ధిల్లు నాయనా?" అని దేవదాసు శిరసును తాకి ఆశీర్వదించి కళ్ళ నీళ్ళు తుడుచుకున్నాడు భువనచౌదరి.

దేవదాసు వెళ్ళిపోయాడు.

జమీందారు మేడమీది కెళ్ళాడు.

పిల్లలకు ఏవో కబుర్లు చెబుతూ, నవ్విస్తూ కూర్చొనివున్న పార్వతి— తలమీదికి చీరకొంగును లాక్కొని, వెళ్ళి భర్త పాదాలను స్పృశించింది.

అర్థం చేసుకున్న భువనమోహనచౌదరి పార్వతి శిరస్సు తాకి, ఆశీర్వదించాడు. చంద్రముఖి స్మృతిలో దేవదాసు ప్రయాణిస్తున్న రైలు కూత పార్వతికి వినిపించింది—

## ❋ చదివిన తరువాత ❋

నిజమైన ప్రేమను గుర్తించి నివాళులర్పించే నిర్మల సంస్కారులకు నమస్కారాలు.

★

